కాలేజీలో చదివేటప్పుడు పక్కింట్లో వుండేవాళ్ళు.

"సినిమాకెళ్దామా?" అని అడిగినందుకు చెంప పగలగొట్టిన మొట్టమొదటి అమ్మాయి... ఆఖరి అమ్మాయ్ కూడా. ఆ రోజు నుంచీ తనతో మాట్లాడలేదు మళ్ళీ ఆ రూమ్ ఖాళీ చేసేవరకూ. జీవితంలో ఓ పెద్ద లాండ్ మార్క్ ఆ చెంపదెబ్బ. మొదటిసారిగా ఆడపిల్లలంటే ఓ బెరుకు కలుగజేసింది.

కానీ అంత కోపం, అంత అఫెన్సివ్ గాళ్ ఇప్పుడిలా-ఎలా పలకరించగలుగుతోంది? ఈ అయిదారేళ్లలో మానసికంగా యింత మార్పెలా వచ్చింది. చెరుకు రసం బండి దగ్గర ఆగారు.

"చెరుకురసమా మనం తాగేది?" అడిగిందామె.

"ప్రస్తుతం మన స్టాండర్డు అదే"

"నేను విద్యానగర్‌లో వుంటున్నాను" అందామె.

"ఐ సీ!"

"అడ్రస్ అడగరేం?"

"అవును- అడ్రసేమిటి?"

"శివం ఎదురుగ్గా సందు- ఒక కిలోమీటరు నడుస్తే ఓ పంపు... అక్కడ కుడివేపు తిరిగితే పెంకుటిల్లు, వెనుకవేపు తిరిగితే ఆరు పోర్షన్లు-అందులో ఆఖరిది."

రెండు గ్లాసుల్లో చెరుకురసం ఇచ్చాడు బండి అతను.

"నాకో సహాయం చేస్తారా?"

ఉలిక్కిపడ్డాడు.

"చెప్పండి"

"నాకెక్కడైనా జాబ్ కావాలి ఇప్పించగలరా?"

సురేష్ నవ్వేశాడు.

"నాకింద పని చేస్తారా?"

ఆమె నమ్మలేనట్లు చూసింది.

"అంటే..." అనుమానంగా చూసింది.

"నా సెక్రటరీగా"

"మీరు....?"

"జనరల్ మేనేజ్. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్ట్‌మెంట్"

ఆమె నిరుత్సాహపడింది. "సారీ మీకు ఉద్యోగం లేదని తెలియదు"

సురేష్ టైం చూసుకున్నాడు.

“ఎక్కడైనా మీకు సూటబుల్ వేకెన్సీ వుంటే తప్పకుండా చెపుతాను.”

ఇద్దరూ మళ్ళీ చౌరస్తా దగ్గరకొచ్చారు.

“ఈ సారి సినిమాకు రావడానికి రెడీ! మీరు ఎప్పుడంటే అప్పుడు” సిగ్గుపడుతూ అంది.

సురేష్ నివ్వెరపోయాడు.

“అలా చూడకండి. ఆ రోజు మీ చెంప పగలగొట్టినందుకిప్పుడు సారీ చెప్పుకుంటున్నాను” కళ్ళల్లో దీనత్వం.

“మీరేం తప్పు చేశారని సారీ చెప్పుకోవటం?”

“ఎప్పుడెవరితో ఏం అవసరం వస్తుందో తెలుసుకోకుండా ప్రవర్తించటం తప్పు కాదంటారా?”

సురేష్ గ్రాఫ్ గజిబిజిగా వుంది. ఏమీ అర్థం కావటం లేదు.

“మీ దగ్గరేమైనా డబ్బుందా? ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి! పరిస్థితులు బావుండలేదు” ఆమె కళ్ళలో అర్థింపు. ఆ రోజున ఉరిమి చూసిన కళ్ళే అవి. సురేష్‌కు మనసు చివుక్కుమంది.

“సారీ ... అయామ్ హెల్ప్‌లెస్”

ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగింది.

“పోనీ రేపైనా ఇవ్వగలరా ? ఎంతో కొంత”

అతని మనసు గిజగిజలాడింది. ఇలాంటి దారుణమైన పరిస్థితిలో ఎప్పుడూ యిరుక్కోలేదు.

అంత అభిమానం, అంత కోపం, అంతటి అద్భుతమైన కారెక్టర్ ఉన్న అమ్మాయేనా ఈ అమ్మాయి?

“మీరు రేపు మా ఇంటికొస్తే- అందుక్కూడా సిద్ధమే” చూపులు వాల్చుకుని నేలతో మాట్లాడింది. ఆ డైలాగ్ ఆమె నోటివెంబడి వినటం భరించలేకపోతున్నాడు.

కళ్ళంబడి ఉప్పెనలా పొంగుకొస్తున్న సముద్రాన్ని అణిచివేయడానికి విశ్వప్రయత్నం జరుగుతోంది.

అనగనగా ఓ శోభాదేవి.

18 ఏళ్ళ అందాలబొమ్మ శోభాదేవి.

తన అందంతో, అవయవపు సౌష్టవంతో చుట్టుపక్కల కుర్రకారుకి నిద్రలేకుండా చేసే శోభాదేవి.

తల్లిదండ్రుల కొక్క ర్తే కూతురవటంవల్ల గర్వంగా, పెంకిగా జీవితానికి భయపడకుండా పెరిగిన శోభాదేవి....

పెళ్ళికి ముందు ప్రేమ, సెక్సూ అంతా ట్రాష్‌అనీ, ఆడదానికి కారక్టరే మెరిట్ సర్టిఫికెట్ అనీ నమ్మి, నవ్వుతూ బ్రేక్ వేయబోయిన తనలాంటి స్టూడెంట్స్ చెంప పగలగొడుతూ సంచలనం సృష్టించిన నిప్పు.

ఆ శోభాదేవా ఇప్పుడు ఇంటికొస్తే అందుకున్నాడా సిద్ధమే అంటోంది. హటాత్తుగా ఎందుకిలా అపశృతి పలికిందామె జీవితం? ఇంకో జన్మనెత్తినట్టు ఎందుకు మారిపోయింది.

పెళ్ళి చేసుకున్నోడు కట్నాల కోసం తన్నితగలేశాడా? అత్తగారు కిరసనాయిలు తీసుకుని వెంటబడిందా? తల్లిదండ్రులు ఈ దృశ్యం చూడలేక కళ్ళు మూశారా?

ఏదీ లేకపోతే తను ప్రేమించే 'కారెక్టర్'ని గంగలో ఎందుకిలా కలిసేసింది?

దిసీజ్ లైఫ్, దిసీజ్ లైఫ్, దిసీజ్ లైఫ్-

దీన్నే నటాషా నవ్వుతూ చెప్పింది ఆ రోజు - వేరే పదాల్లో.

"మనందర్నీ, మనం చేసే పనుల్లోకి పరిస్థితులు దించుతాయి."

"మాట్లాడరేం? నేనంటే ఇప్పుడు ఇష్టం పోయిందా?" ఆమె కళ్లలో సుడులు తిరుగుతున్న నీళ్లు.

సురేష్‌కి అక్కడి నుంచి పారిపోవాలని వుంది.

"రేపు వస్తాను."

"ప్రామిస్?" ఆశ.

"ప్రామిస్."

"మీ కోసమే వెయిట్ చేస్తుంటాను."

ఆమె వెళ్ళిపోయింది జన ప్రవాహంలోకి! ఆ ప్రవాహంలో మరో జన్మ ఎత్తిన పాత్రలు ఎన్ని వున్నాయి?

దీపా, తులసి ఉత్సాహంగా ఏదో మాట్లాడుకొంటూ వస్తున్నారు. తనను చూడగానే దీప ముఖంలో కాంతి మాయమవటం గమనించాడు సురేష్ . ఇరిటేషన్ కళ్ళల్లో నుంచి తొంగిచూస్తోంది. అది తనకు మరింత ఇన్‌స్పిరేషన్ కలిగిస్తుంది.

"హలో దీపాజీ!"

"హలో" ముక్తసరిగా అందామె.

"ఇవాళ దీప మన గెస్ట్" నవ్వుతూ చెప్పింది తులసి .

"అయితే పవర్ ఫుల్ యాఫ్రోడిసియాక్ తెచ్చుకుంటాను మెడికల్ స్టోర్కెళ్ళి."

దీపకర్థం కాలేదు.

"అంటే ఏమిటి?"

"ఇంట్లో ఇద్దరు గాళ్ళ్ వున్నప్పుడు...."

దీపం ముఖం మరింత మాడిపోయింది.

తులసి బ్యాగ్‌తో అతని భుజం మీద లాగి కొట్టింది నవ్వాపుకుంటూ.

"పదండి వెళదాం"

ముగ్గురూ బస్‌లో బయల్దేరారు

"రెండూ ఆడ టికెట్లేనా?" నవ్వుతూ అడిగాడు కండక్టర్.

"ఇవాళ మూడు! బిజినెస్ బాగా అభివృద్ధి అయింది."

ఇంటిలో కెళుతుంటే గంగాభవాని తనను చూసి నవ్వింది. అతనికి సంతృప్తి కలిగింది. ఉదయం తను వాడిన మందు పనిచేసిందన్నమాట లేకపోతే తెల్లారి లేస్తే ఆమెతో పేచీ పడటం కష్టం! ఇప్పుడిక ఏ గొడవ వుండదు.

తులసి 'టీ' తయారుచేస్తోంది. దీప టవల్‌తో ముఖం తుడుచుకుంటోంది అద్దం ముందు నిలబడి.

"ఏమిటివాళ ఇంత సడెన్‌గా వచ్చారు?" దీప నడిగాడు.

"ఆయన కాంప్‌కెళ్ళాడు, తులసితో సరదాగా గడిపి చాల రోజులయిందని......"

"నేను చెప్పలేదూ- పెళ్ళి చేసుకుంటే థ్రిల్ వుండదనీ ?"

ఆమె అసహనంగా చూసింది.

"థ్రిల్ ఏమిటి?"

"చూశారా థ్రిల్ అంటే ఏమిటి అని అడిగేంత డల్ అయిపోయింది మీ లైఫ్ ఇప్పుడు! డల్ అయినప్పుడే కాంప్ కెళ్ళిపోతారు చాలా మంది . ఓ.కె ఇవాళ ఒక్కరోజుకి హెల్ప్ చేస్తానులెండి"

"మీకిలా మాట్లాడటానికి సిగ్గు వేయటం లేదూ?"

"మా కాలేజ్‌మేట్ సీత యిలాగే సిగ్గుపడి కొంపకు చేటు తెచ్చుకుంది".

"ఎందుకు?"

"విఠల్ దగ్గర పెళ్ళి సంగతి ఎత్తటానికి. తరువాత అడిగితే నేను తండ్రిని కాదు పొమ్మన్నాడు"

తులసి 'టీ ' తీసుకొచ్చి ఇచ్చింది ముగ్గురికీ.

"త్వరగా వెజిటబుల్స్ తీసుకురా! మళ్ళీ దీప వాళ్ళింటికెళ్ళాలి భోజనం చేశాక"

సురేష్ సంచీ తీసుకుని బయల్దేరాడు. గంగాభవాని మళ్ళీ నవ్వింది.

"ఎక్కడికి?"

"వెజిటబుల్స్‌కి"

“మన పాదులున్నాయిగా?”

“మళ్ళీ తులసితో కంప్లైంట్ చేయటానికా?”

ఆమె నవ్వింది మళ్ళీ. తులసి త్వర త్వరగా వంట ముగించింది. భోజనం చేశాక ముగ్గురూ బయల్దేరారు.

“పోనీ రాత్రికిక్కడే వుండిపోకూడదూ?” అంది తులసి.

“ఉహు! వద్దు. ఆయన తెల్లారుజామున వచ్చేస్తానన్నారు”

“అలా అయినా లాభం ఏం వుండదు ” అన్నాడు సురేష్.

“పెళ్ళి చంపేశాక ఇంక బ్రతకదది? మీ రెంత ప్రయత్నించినా సరే”

దీపక్కూడా నవ్వాగలేదు గానీ అతి కష్టం మీద నొక్కిపట్టింది. ఆమె బస్‌లో ఎక్కగానే ఇద్దరు తిరిగి ఇంటి వైపు బయల్దేరారు. తులసి వారపత్రికలో తను చదివిన డాక్టర్ సమాధానాల గురించి చెబుతోంది పెద్దగా నవ్వుతూ.

“డాక్టర్ అక్కా! నేను కావాలని కోరి పెళ్ళి చేసుకున్నతను నిజంగా సెక్స్ రాక్షసుడని తెలిసిందక్కా! నన్ను ఒంటరిగా ఒక్క క్షణం కూడా వదలటం లేదు. రాత్రి పగలు లేదు. పొద్దున్న కాఫీ కాస్తున్నప్పుడూ , వంట చేస్తున్నప్పుడు , ఇల్లు శుభ్రం చేస్తున్నప్పుడు, స్నానం చేస్తున్నప్పుడు, టి.వి చూస్తున్నప్పుడు అబ్బ ప్రాణం విసిగిపోతోంది. నువ్వే నాకు సహాయం చేయాలక్కా. ఏదో ఒకదారి చూపితే నీ మేలు మర్చిపోను. అన్నట్లు సారీ అక్కా! హ్యాండ్ రైటింగ్ యిలా షేకీగా వున్నందుకు”